సాక్షి వరంగల్

శనివారం | 30 | నవంబర్ | 2024



ఉద్యమ కల సాకారం - 8లో

అయోధ్యపురం వద్ద 160 ఎకరాల్లో వ్యాగన్ పీఓహెచ్ షెడ్ నిర్మాణ పనులు 65 శాతం పనులు పూర్తికాగా.. 2025 ఆగస్టులో ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు.



ఇన్‌స్టాగ్రామ్ పరిచయమే ప్రాణం తీసింది..

ఇన్‌స్టాగ్రామ్‌లో మహిళతో ఏర్పడిన పరిచయం ఓ యువకుడి హత్యకు దారితీసింది. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 28^0 /21^0

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. రాత్రి సమయంలో చలితోపాటు పొగ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

రెగ్యులర్ జడ్జిలను నియమించాలి



నర్సంపేట రూరల్: నర్సంపేట కోర్టులో రెగ్యులర్ జడ్జిలు లేకపోవడంతో కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయని, తక్షణమే రెగ్యులర్ జడ్జిలను నియమించాలని నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టపాక రవి, ప్రధాన కార్యదర్శి సిలువేరు కిరణ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని హైకోర్టులో వరంగల్ పోర్ట్‌పోలియో జడ్జి మౌశమిభట్టాచార్యను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది దాసి రమేశ్, అంబటి రాజ్‌కుమార్, నర్సంపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీ బండి శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి

కాళోజీ సెంటర్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను మధ్యాహ్న భోజనం పథకం నుంచి పూర్తిగా మినహాయించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉటుకూరి అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో అనేక లోపాలున్నాయని తెలిపారు.

జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఖానాపురం: జాతీయస్థాయి పోటీల్లో మండలంలోని అశోక్‌నగర్ సైనిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ గట్ల సురేందర్ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్‌లో 35 కిలోల కటాస్ విభాగంలో షేక్‌అయాన్, 41 కిలోల కటాస్ విభాగంలో షేక్‌రియాన్ బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ పోటీలు హనుమకొండలో ఈ నెల 24న నిర్వహించినట్లు పేర్కొన్నారు.

కెనరా బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి



వర్ధన్నపేట: కెనరా బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కేఎస్.మాధవి సూచించారు. వర్ధన్నపేట పట్టణంలో శుక్రవారం కెనరా బ్యాంకు నూతన శాఖను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ వరంగల్ రీజినల్ పరిధిలో 49వ శాఖ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కెనరా బ్యాంకు అందించే డిజిటల్ సేవలను పట్టణ ప్రజలతోపాటు వివిధ గ్రామాల ప్రజలు పొందాలన్నారు. అన్ని రకాల ఖాతాలతోపాటు రుణాలు అందించే సౌకర్యం ఉందన్నారు. డివిజనల్ మేనేజర్ మైలారప్ప, బ్రాంచ్ మేనేజర్ సుధీర్ కుమార్, సాయి ప్రఫుల్లా పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

కాళోజీ సెంటర్: సోలార్ ఎనర్జీ, విండ్ ఎనర్జీ, జియో థర్మల్ ఎనర్జీ, హైడ్రో పవర్‌ను ఉపయోగించి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని ఏఎంఓ సుజన్‌తేజ సూచించారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా వరంగల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'రెన్యువబుల్ ఎనర్జీ సోర్సెస్' అంశంపై నిర్వహించిన పోటీల్లో 39 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

గుండెపోటుతో యువకుడి మృతి




రాకేశ్ (ఫైల్)

వర్ధన్నపేట: గుండెపోటుతో యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని చెన్నారంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మడూరి భిక్షపతి–కవిత దంపతులకు కుమారుడు రాకేశ్ (20), కుమార్తె ఉన్నారు. రాకేశ్ ఇటీవల డిగ్రీ పూర్తిచేసి గ్రామంలోని ఓ రైతు వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం అకస్మాత్తుగా గుండెలో నొప్పి రావడంతో తల్లిదండ్రులకు తెలిపాడు. వారు స్థానిక వైద్యుడికి చూపించగా వెంటనే వరంగల్‌కు తీసుకెళ్లాలని సూచించాడు. రాకేశ్‌ను ఆటోలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

సాధికారతకు ముందడుగు..

మహిళల శిక్షణ కేంద్రంగా ఇందిరా మహిళా శక్తి భవనం



ఇందిరా మహిళ శక్తి భవనానికి కేటాయించనున్న సంగెంలోని ఎస్టీ బాలుర పోస్ట్‌మెట్రిక్ హాస్టల్

- గిరిజన బాలుర పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ కేటాయింపు
- సంగెం, గీసుకొండ మండలాల మహిళలకు శిక్షణ
- ఇటీవల సందర్శించిన వీహబ్ సీఈఓ సీత పళచోళ్ల, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

జిల్లాలో మండల సమాఖ్యలు	: 11
గ్రామ సంఘాలు	: 435
మహిళా సంఘాలు	: 11,277
మహిళా సభ్యులు	: 1,22,431

సంగెం: మహిళలు సాధికారత సాధించేందుకు రాష్ట్రంలోని ప్రజాప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి భవనాలను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఇందుకోసం పరకాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చొరవతో ముందడుగు పడింది. నిరుపయోగంగా ఉన్న భవనాలను ఇందిరా మహిళా శక్తి భవనాలకు కేటాయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. సంగెం మండల కేంద్రంలో 2016–17లో రూ.170 కోట్లు వెచ్చించి నిర్మించిన గిరిజన బాలుర పోస్ట్‌మెట్రిక్ వసతి గృహం నిరుపయోగంగా ఉంది. దానిని సంగెం, గీసుకొండ మండలాల ఇందిరా మహిళా శక్తి భవనంగా, దామెర మండల కేంద్రంలోని దేవాదుల క్వార్టర్లను ఆత్మకూరు, దామెర మండలాల ఇందిరా మహిళా శక్తి భవనంగా మార్చి ఉపయోగంలోకి తీసుకురావడానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. ఈ ప్రక్రియను వేగవంతం చేయడంలో భాగంగా ఈ నెల 21న రాష్ట్ర వీహబ్ సీఈఓ సీత పళచోళ్ల అధికారుల బృందం, పరకాల ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు సంగెం, దామెరలోని నిరుపయోగంగా ఉన్న భవనాలను పరిశీలించారు. త్వరలోనే ఇందిరా మహిళా శక్తి భవనాలుగా మార్చి స్వయం సహాయక సంఘాల మహిళలకు కేటాయిస్తామని తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హనుమకొండలో నిర్వహించిన సభలో ఇందిరా మహిళా శక్తి భవనాలకు శంకుస్థాపన చేసిన విషయం విదితమే.



హాస్టల్‌ను పరిశీలిస్తున్న వీ హబ్ సీఈఓ సీత పళచోళ్ల , పరకాల ఎమ్మెల్యే రేవూరి (ఫైల్)

ఆర్థికాభివృద్ధి బాటలో మహిళలు..

ఇప్పటికే బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రుణాలు తీసుకున్న మహిళలు సద్వినియోగం చేసుకుని వివిధ వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కిరాణాషాపులు, బట్టల షాపులు, యూనిఫాం తయారీ, పచ్చళ్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోళ్ల పెంపకం వంటి ద్వారా ఉపాధి పొంది ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు.

మహిళలకు ఎంతో ఉపయోగం..

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతోపాటు వారు సమావేశాలు, సమాఖ్య కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు ఇందిరా మహిళా శక్తి భవనాలు ఎంతగానో ఉపయోగపడతాయి.

స్వయం సహాయక సంఘాల శిక్షణ కేంద్రం, నైపుణ్య సామర్థ్యాల పెంపు, క్రెడిట్ సౌకర్యాలు, వ్యవస్థాపకత అభివృద్ధి, మహిళలకు విద్య, అక్షరాస్యత, లైబ్రరీలు, ఇండోర్ గేమ్స్ వినోదం, విశ్రాంతికి వినియోగించనున్నారు. మహిళలు వ్యాపారం ఎలా చేయాలి, కుటీర పరిశ్రమల్లోని ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడం వంటి అంశాలను చర్చించి, సాధికారత సాధించేలా ప్రణాళికలు రూపొందించుకోనున్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బలహీన, అట్టడుగువర్గాల మహిళలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఇప్పటికే సంగెం మండల కేంద్రంతోపాటు పలు చోట్ల మహిళాశక్తి క్యాంటీన్లను ప్రారంభించి మహిళలు సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారు.

మహిళా సంఘాలకు వరం..



ఇందిరా మహిళా శక్తి భవనాల కేటాయింపు స్వయం సహాయక మహిళలకు వరం లాంటిది. ప్రభుత్వం మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక పథకాలను ప్రవేశం పెట్టడం ఆనందంగా ఉంది. ఇందులో శిక్షణ పొంది మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదుగుతారు. ఆర్థికాభివృద్ధిలో తాము కూడా మగవారికి తక్కువ కాదని నిరూపించుకునే అవకాశం ఉంది.

– కర్నె కల్యాణి, సంగెం శాంతి మండల సమాఖ్య అధ్యక్షురాలు

జమిలి ఎన్నికల్లో కాంగ్రెస్ ఖేల్ ఖతం



నినాదాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి, పెద్ది, చల్లా, నన్నపునేని, బీఆర్‌ఎస్ శ్రేణులు

కార్యకర్తలకు అండగా గులాబీ జెండా

- కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ ఏర్పాటు
- దీక్షా దివస్‌లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- హాజరైన జిల్లా ఇన్‌చార్జ్ ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి





మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

ఖిలా వరంగల్: దేశవ్యాప్తంగా రానున్న జమిలి ఎన్నికల్లో కాంగ్రెస్ ఖేల్ ఖతమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. కార్యకర్తలకు గులాబీ జెండా అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. వరంగల్ ఉర్సుగుట్ట జంక్షన్‌లోని నాని గార్డెన్‌లో శుక్రవారం దీక్షా దివస్ నిర్వహించారు. ముందుగా అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. అనంతరం కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ మంత్రి దయాకర్ రావు మాట్లాడారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అనే నినాదంతో నవంబర్ 29న తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారని గుర్తు చేశారు. కేసీఆర్ చావు అంచుల వరకు వెళ్లి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని స్పష్టం చేశారు. డిసెంబర్ 7న తెలంగాణ ప్రకటన వెలువడాల్సి ఉండగా.. సోనియాగాంధీ పుట్టిన రోజు గుర్తుగా రెండు రోజులు ఆలస్యంగా ప్రకటించారని ఆరోపించారు. పరాయి పాలనలో బతికిన మనకు స్వేచ్ఛనిచ్చింది కేసీఆర్ మాత్రమేనని చెప్పారు.

కేసీఆర్ ఉద్యమ దళపతి : ముత్తిరెడ్డి

దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ఉద్యమ దళపతి అని, నవంబర్ 29 మర్చిపోని రోజు అని, బంగారు తెలంగాణను సాధించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని అన్నారు. నాటి ఉద్యమ స్ఫూర్తి, చరిత్ర భవిష్యత్ తరాలకు తెలియాలనే ఉద్దేశంతో దీక్షా దివస్ జరుపుకున్నామని తెలిపారు. పోరుగడ్డపై మరోసారి ఈ కార్యక్రమం నిర్వహించుకోవడం సంతోషకరంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. ప్రజల ఆకాంక్ష కోసం కేసీఆర్ చేపట్టిన దీక్ష 15 ఏళ్లు పూర్తి చేసుకుందని గుర్తు చేశారు. కేసీఆర్ పోరాటం దేశ చరిత్రలో నిల్చిందని, రేవంత్‌రెడ్డి చరిత్ర ఏమిటో అందరికి తెలుసని దుయ్యబట్టారు. ప్రతి కార్యకర్త ధైర్యంగా పార్టీ జెండా భుజన వేసుకుని పనిచేయాలని సూచించారు. దీక్షా దివస్ కార్యక్రమంలో భాగంగా కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, మరుపల్లి రవి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేశ్‌బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేనున్నాను.. అధైర్యపడకండి

- మీకు డయాలసిస్ సేవలందుతాయి
- సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో రోగులకు భరోసా ఇచ్చిన కలెక్టర్ సత్యశారద

ఎంజీఎం: కాకతీయ వైద్య కళాశాల ప్రాంగణంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో రెండు రోజులుగా నీరు రాకపోవడంతో డయాలసిస్ సేవలు నిలిచిపోయాయి. ఇద్దరు రోగులు మృతి చెందారు. మాకు న్యాయం చేయండి అంటూ.. ఓ వృద్ధుడు శుక్రవారం ఎంజీఎంకు వచ్చిన కలెక్టర్ ఎదుట ఆందోళనకు దిగాడు. డయాలసిస్ రోగి తీవ్ర ఆవేశానికి లోనవుతున్న విషయాన్ని గ్రహించిన కలెక్టర్ స్వయంగా ఆ రోగి వద్దకు వెళ్లి 'పెద్దమనిషి' అని సంబోధిస్తూ.. 'నేను నీ చెయ్యి పట్టుకున్నాను.. నువ్వు అధైర్యపడకు.. మీకు అండగా ఉంటా.. ఆస్పత్రికి నీరు అందిస్తా.. డయాలసిస్ సేవలు ప్రారంభిస్తా' అంటూ ఆందోళన చేసిన రోగులను సముదాయించారు. వెంటనే అక్కడున్న ఎంజీఎం అధికారులను పిలిచి సాయంత్రంలోగా నీటి సరఫరాను పునరుద్ధరించి డయాలసిస్ సేవలు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆస్పత్రిలో శాశ్వత నీటి ఏర్పాటుకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డయాలసిస్ రోగులపై ఆగ్రహం వ్యక్తం చేసిన వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఎంజీఎం ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌ను ఆదేశించారు.



ఆందోళన చేస్తున్న రోగిని సముదాయిస్తున్న కలెక్టర్ సత్య శారద

నూతన ఓపీ కౌంటర్ల పరిశీలన

నూతనంగా ఏర్పాటు చేసిన ఓపీ కౌంటర్లను కలెక్టర్ సత్య శారద పరిశీలించారు. ఈసందర్భంగా ఆస్పత్రికి నూతనంగా మంజూరు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను, ఓపీ విభాగం నుంచి తరలించిన పాలియేటివ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఫార్మసీ విభాగంలో మరో ఐదు కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్, ఎంజీఎం పరిపాలనాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌కుమార్, ఆర్‌ఎంఓలు మురళి, శ్రీనివాస్, శశి, తహసీల్దార్ ఇక్బాల్ పాల్గొన్నారు.

కేఎంటీపీలో అభివృద్ధి పనులు చేపట్టాలి

- కలెక్టర్ సత్య శారద

గీసుకొండ: జిల్లాలోని గీసుకొండ–సంగెం మండలాల పరిధిలో ఏర్పాటైన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ)లో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన అభివృద్ధి పనులను త్వరగా చేపట్టాలని కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె కేఎంటీపీని సందర్శించారు. దక్షిణ కొరియాకు చెందిన యంగ్‌వన్ కంపెనీ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్కు ప్రాంతంలో భూములు కోల్పోయిన రైతులకు ఇంటి స్థలాలతోపాటు ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. వాటిని లబ్ధిదారులకు అందించే ఏర్పాట్లు త్వరగా చేయాలన్నారు. అలాగే, టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేయాలని, కొత్తగా మంజూరైన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, పశువైద్యశాల, పాఠశాలల నిర్మాణాలకు స్థలాలను కేటాయించి హద్దులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. టెక్స్‌టైల్ పార్కులో వరద నీరు నిల్వ ఉండకుండా నాలా నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.160 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. టీజీఐఐసీ జెడ్‌ఎం స్వామి, వరంగల్ ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, డీఈ సునీత, గీసుకొండ, సంగెం తహసీల్దార్లు ఎం.డీ.రియాజుద్దీన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



కేఎంటీపీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య శారద


ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలి

వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న సీఎం కప్–2024 పోటీలను విజయవంతం చేయాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సీఎం కప్–2024పై శుక్రవారం అధికారులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. డిసెంబర్ 7, 8 తేదీల్లో గ్రామస్థాయి, 10 నుంచి 12 వరకు మండల స్థాయి, 16 నుంచి 21 వరకు జిల్లాస్థాయి క్రీడాపోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయాలని, నిష్పక్షపాతంగా ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్రంలో జిల్లాను అగ్రగామిగా నిలిచేలా చూడాలన్నారు. వరంగల్‌లోని ఓసిటీ స్టేడియం, చింతల్ మైదానం, దేశాయిపేటలోని సీకేఎం కళాశాల మైదానంలో నిర్వహించే క్రీడాపోటీలకు అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. డీసీపీ రవీందర్, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, డీవైఎస్‌ఓ సత్యవాణి, డీపీఓ కల్పన, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, సీఎంహెచ్‌ఓ రాజిరెడ్డి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సంగెం: పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలానికి చెందిన 48 మందికి, 17వ డివిజన్‌కు చెందిన ఆరుగురికి శుక్రవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత ప్రజా ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గతంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల కోసం ఎమ్మెల్యే, ఎంపీ కార్యాలయాల వద్ద నిరీక్షించేవారని పేర్కొన్నారు. లబ్ధిదారుల వద్ద డబ్బులు తీసుకుంటే సహించేదిలేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, నాయకులు మాధవరెడ్డి, రమేశ్, వీరమ్మ, సంధ్య, రాధిక పాల్గొన్నారు.



సంగెంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

కళాశాలలో మధ్యాహ్న భోజనానికి సహకారం అందించాలి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకానికి సహకారం అందించాలని కళాశాల ప్రిన్సిపాల్ కాక మాధవరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కళాశాలలో 143 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

రాయపర్తి: విధుల్లో అప్రమత్తంగా ఉంటూ కూలీలకు పనులు కల్పించాలని, అవకతవకలకు పాల్పడితే అధికారులు, సిబ్బంది బాధ్యత వహించాలని డీఆర్‌డీఓ కౌసల్యాదేవి స్పష్టం చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై శుక్రవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. మండలంలోని 40 గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులపై చర్చించి, పనుల వివరాలు చదివి వినిపించారు. గ్రామాల్లో చనిపోయిన మొక్కలు బతికున్నట్లు, కొన్ని గ్రామాల్లో కూలీలు పని చేయకున్నా పని చేసినట్లు రికార్డుల్లో రాసి ఉండడంపై ఆమె మండిపడ్డారు. ఎస్‌క్యూసీఓ పుష్పలత, సూపరింటెండెంట్ రమేశ్, ఏపీఓ మాధవి, ఎంపీడీఓ కిషన్, ఏపీఓ కుమార్‌గౌడ్, ఎస్‌టీఎం సాయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ కౌసల్యాదేవి

వర్ధన్నపేటలో కేంద్ర బృందం పర్యటన




మిషన్ కుడుతున్న మహిళతో అధికారులు

వర్ధన్నపేట: వర్ధన్నపేటలో శుక్రవారం కేంద్రం బృందం పర్యటించి సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి తెలుసుకుంది. అమృత్–2.0లో భాగంగా చేపట్టిన వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు, వీధి వ్యాపారులు తీసుకున్న రుణాలను అధికారులు సందీప్, టీకే.సింగ్, శుభం అరోరా, శోభా రావత్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో ఆయుష్మాన్ భారత్ గురించి, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి మున్సిపల్ కమిషనర్ సుధీర్‌కుమార్ వివరించారు. కుట్టు మిషన్‌తో ఉపాధి పొందుతున్న మహిళలతో మాట్లాడి సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామ్మూర్తి, మెప్మా ఏడీఎం వహిదా, మున్సిపల్ అధికారులు, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.వీరయ్య
- నర్సంపేటలో 20వ జిల్లా మహాసభలు

నర్సంపేట: ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.వీరయ్య అన్నారు. సీపీఎం నర్సంపేట పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 20వ జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని మార్చి మనువాదాన్ని బలవంతంగా రుద్దాలని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తోందని ఆయన మండిపడ్డారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచి సామాన్య ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్న వారిని జైల్లో పెడుతూ దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలు చేస్తోందన్నారు. నల్ల చట్టాలను విరమించుకున్న మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చడంలో జాప్యం చేస్తోందన్నారు.



మహాసభల్లో మాట్లాడుతున్న ఎస్.వీరయ్య

పూర్తిస్థాయిలో రైతు రుణమాఫీ పూర్తి కాలేదని, రెండు వ్యవసాయ సీజన్లు పూర్తయినా రైతు భరోసా అందడం లేదన్నారు. ఆరు గ్యారంటీలు అని చెప్పి ప్రజలకు భ్రమలు కల్పించి ఇప్పుడు అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. నర్సంపేటలో కమ్యూనిస్టులకు పూర్వ వైభవం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ముందుగా అమరవీరుల స్తూపం నుంచి అంగడి సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.నాగయ్య, పోతినేని సుదర్శన్, రాష్ట్ర నాయకులు జి.రాములు, కాసు మాధవి, జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈసంపల్లి బాబు, భూక్యా సమ్మయ్య, కోరబోయిన కుమారస్వామి, నలిగంటి రత్నమాల, జిల్లా కమిటీ సభ్యులు నమిండ్ల స్వామి, బషీర్, పట్టణ నాయకులు గడ్డమీది బాలకృష్ణ, కందికొండ రాజు, ఇప్ప సతీశ్, ఎండీ.ఫరీదా, వజ్జంతి విజయ, స్వప్న, నాగమణి పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ డీసీపీఓ శ్రీదేవి బాధ్యతల స్వీకరణ

కాళోజీ సెంటర్: వరంగల్ బాలరక్షాభవన్ ఇన్‌చార్జ్ డీసీపీఓగా నర్సంపేట ఏసీడీపీఓ శ్రీదేవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్ ఇటీవల సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. బాలరక్షాభవన్‌ను ప్రక్షాళన చేయాలని డీడబ్ల్యూఓను ఆదేశించారు. దీంతో ఇంతకు ముందు విధులు నిర్వర్తిస్తున్న ఇన్‌చార్జ్ డీసీపీఓను బాధ్యతలను తప్పించి శ్రీదేవికి అప్పగించారు.

క్లుప్తంగా

నేటి నుంచి జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్, వరంగల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నేటి నుంచి జాతీయ స్థాయి టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, మనోహర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస్ గౌడ్ స్మారకార్థం నిర్వహించే టోర్నమెంట్ ఈ నెల 30 నుంచి డిసెంబర్ 7వ తేదీ వరకు ఓపెన్ మెన్స్ కేటగిరీలో జరగనున్నట్లు వెల్లడించారు. సుబేదారిలోని వరంగల్ క్లబ్ వేదికగా జరిగే టోర్నమెంట్‌లో విజేత జట్టుకు రూ.2.5 లక్షల నగదు పురస్కారంతో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యే పోటీలకు నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, కలెక్టర్ ప్రావీణ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దహనం

- రూ.2లక్షల ఆస్తి నష్టం



కాలిపోయిన ఇంటి ఎదుట బాధితులు

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని నమిలిగొండలో ప్రమాదవశాత్తు బోనగిరి సాంబరాజుకు చెందిన ఇల్లు, ఇంటిలో వస్తువులు దహనమై రూ.2లక్షల ఆస్తి నష్టం వాటిల్లిన ఘటన శుక్రవారం జరిగింది. బాధితులు సాంబరాజు, అపర్ణ దంపతులు తెలిపిన వివరాలు ప్రకారం.. నమిలిగొండ గ్రామానికి చెందిన సాంబరాజు హమాలీ పని చేస్తుండగా అతని భార్య వ్యవసాయ కూలీగా కుటుంబాన్ని పోషిస్తున్నారు. రోజూ మాదిరిగానే శుక్రవారం వారు పనులకు, పిల్లలు పాఠశాలకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఇంట్లోని టీవీ, మంచాలు తదితర ఫర్నీచర్, దుస్తులు, బియ్యం బస్తాలు, రూ.30వేలు నగదు కాలిబూడిదయ్యాయి. ఇంట్లో నుంచి పొగలు రావడం గమనించిన చుట్టుపక్కల వారు సాంబరాజుకు సమాచారం అందించారు. స్థానికుల సాయంతో మంటలను అదుపుచేశారు. కానీ, అప్పటికే వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు, సామగ్రి కాలిపోవడంతో మాజీ ఎంపీటీసీ సభ్యుడు పురమాని రజాక్‌యాదవ్, కాంగ్రెస్ నాయకుడు కుందూరు అశోక్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబానికి రూ.5వేలు అందించారు. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సాయం అందించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

కాజీపేట మండలం అయోధ్యపురంలో కొనసాగుతున్న రైల్వే వ్యాగన్ షెడ్ నిర్మాణాలు





ఉద్యమ కల సాకారం

కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసం 45ఏళ్లు సాగిన పోరాటం

- 1977–1978లో ఆజంజాహి మిల్లులో కార్మికుల తొలగింపుతో తెరపైకి కోచ్ ఫ్యాక్టరీ నినాదం
- 1979లో కమ్యూనిస్టులు భగవాన్ దాస్, కాళిదాస్ ఆధ్వర్యంలో ఉద్యమం
- తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర విభజన చట్టంలో కీలక అంశంగా కోచ్ ఫ్యాక్టరీ ప్రస్తావన
- కోచ్ ఫ్యాక్టరీ, డివిజన్ కోసం 13 ఏళ్లు పోరాడిన రైల్వే జేఏసీ
- పీపుల్స్‌వార్, మావోయిస్టుల మద్దతు



కాజీపేట రూరల్: ఉమ్మడి జిల్లా ప్రజల ఉపాధికి పెద్దదిక్కుగా ఉన్న నాటి ఆజంజాహి మిల్లులో కార్మికుల సంఖ్యను మెల్లమెల్లగా తగ్గిస్తున్న నేపథ్యంలో.. నాటి కామ్రేడ్లు భగవాన్ దాస్, కాళిదాస్ ఉమ్మడి జిల్లాలో ప్రత్యామ్నాయ ఉపాధి కోసం కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని తెరపైకి తీసుకొచ్చారు. ఊరూరా ఉద్యమించి గల్లీ నుంచి ఢిల్లీ వరకు కోచ్ ఫ్యాక్టరీ నినాదాన్ని తీసుకెళ్లి సక్సెస్ అయ్యారు. వారి పోరాట స్ఫూర్తితో రాజకీయ పార్టీలు, సంఘాలకు అతీతంగా కాజీపేట, వ్యాగన్ షెడ్, కోచ్ ఫ్యాక్టరీ, కాజీపేట డివిజన్ కోసం కాజీపేట తెలంగాణ రైల్వే జేఏసీ నాయకులు 13 ఏళ్లపాటు సుదీర్ఘ పోరాటం చేశారు. ఈనేపథ్యంలో రైల్వే వ్యాగన్, కోచ్ ఫ్యాక్టరీ, డివిజన్‌పై 'సాక్షి' ప్రత్యేక కథనం.

నెరవేరనున్న కల

పదమూడున్నరేళ్ల రైల్వే జేఏసీ ఉద్యమంతో కాజీపేటకు రైల్వే వ్యాగన్ పీఓహెచ్ షెడ్, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు, నేడు కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు బాటలు పడ్డాయి. దీంతో నాలుగు దశాబ్దాల కల సాకారం కానుందని ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆజంజాహి కార్మికుల తొలగింపు.. కోచ్ ఫ్యాక్టరీ ఉద్యమం..

జిల్లాలోని ఆజంజాహి మిల్లులో 1977–78లో కార్మికుల తొలగింపు ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం చేస్తే జిల్లాలో కొంత వరకు నిరుద్యోగ సమస్య తీరుతుందని గ్రహించిన నాటి కామ్రేడ్లు భగవాన్‌దాస్, కాళిదాస్ 1978లో ఉద్యమం చేపట్టారు. ఊరూరా సైకిల్ యాత్రలు చేపట్టి ప్రజలను చైతన్యవంతం చేశారు. బ్రిటీష్, నిజాం సర్కార్ కాలంలో ఇల్లందులో బొగ్గుగనుల కేంద్రం నుంచి బొగ్గు గనులు తీసి, ట్రైన్ కోచ్ షీట్స్ హీట్ చేసేవారు. ఇల్లందులో కోల్ మైనింగ్ కేంద్రం ఉంది.. కావున కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టాలనే ఉద్యమం ఎగిసింది. కాజీపేట– మద్రాస్ వరకు అప్పట్లో సింగిల్‌లైన్ ఉంది. జిల్లాలో కోచ్ ఫ్యాక్టరీ కోసం ఉద్యమిస్తున్న సమయంలోనే మద్రాస్‌లో వ్యాగన్ వర్క్ షాప్ నెలకొల్పారు. తర్వాత కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేశారు. ఇది కూడా జిల్లా నుంచి మద్రాస్‌కు కోచ్ ఫ్యాక్టరీ తరలిపోయిందని చెప్పవచ్చును. ఈక్రమంలో 1982లో కోచ్ ఫ్యాక్టరీ ఉద్యమం తీవ్రంగా సాగింది. అదే సమయంలో జిల్లాకు ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ కూడా మంజూరు అయి తెరమరుగైంది.

వ్యాగన్‌షెడ్ నిర్మాణం

అయోధ్యపురం వద్ద 160 ఎకరాల్లో వ్యాగన్ పీఓహెచ్ షెడ్ నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోదీ గత సంవత్సరం శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు 65 శాతం పనులు పూర్తికాగా.. 2025 ఆగస్టులో వ్యాగన్ పీఓహెచ్ షెడ్ ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు.

2009లో వ్యాగన్ షెడ్ మంజూరు

కాజీపేట రైల్వే డివిజన్, కోచ్ ఫ్యాక్టరీ ఉద్యమ నేపథ్యంలో 2009లో నాటి రైల్వే మంత్రి మమతా బెనర్జీ హయాంలో కాజీపేటకు రైల్వే వ్యాగన్ షెడ్ మంజూరైంది. తర్వాత కాజీపేటలో ఎలక్ట్రిక్ షెడ్ నిర్మాణం జరిగింది. 2011లో తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో కాజీపేట తెలంగాణ రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కొండ్ర నర్సింగరావు నేతృత్వంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, కాజీపేట డివిజన్ ప్రస్తావన బలంగా ముందుకు సాగింది. తర్వాతర్వాత రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, డివిజన్ ప్రస్తావన రాజకీయ అంశంగా మారి తెలంగాణ ఉద్యమంలో ప్రధాన డిమాండ్లుగా నిలిచాయి.

1983లో కమిటీ ఏర్పాటు

ప్రధానిగా ఇందిరాగాంధీ ఉన్న సమయంలో కెబినెట్‌లో తెలంగాణ నుంచి మానవవనరుల శాఖ మంత్రిగా పీవీ నర్సింహారావు కొనసాగారు. ఆసమయంలో భగవాన్‌దాస్, కాళిదాస్‌ల పోరాటంతో 1983లో జిల్లాలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయాలని ఇందిరాగాంధీ కమిటీ వేసింది. భూసేకరణ కూడా జరిగింది. అదే ఏడాది (1983)లో ఎన్నికలు వచ్చాయి. ఎన్నికల్లో జిల్లా నుంచి పీవీ నర్సింహారావు ఓటమి చెందారు. బీజేపీ, టీడీపీ అలయన్స్‌తో కోచ్ ఫ్యాక్టరీ నినాదంతో జంగారెడ్డి ఎంపీ అయ్యారు. హనుమకొండ నుంచి ఓటమి చెందిన పీవీ.. నాగపూర్ రాంటిక్ నుంచి విజయం సాధించారు.

ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీకి గ్రీన్ సిగ్నల్

కాజీపేటలో వ్యాగన్ షెడ్ నిర్మాణ పనులు కొనసాగుతుండగా కేంద్రం కాజీపేటకు ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆర్‌వీఎన్ఎల్ సంస్థ కాజీపేట వ్యాగన్‌షెడ్‌లో కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టింది. ఇప్పటికే కోచ్ ఫ్యాక్టరీకి రూ.580 కోట్లు, మరో దఫా రూ.66 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇదిలా ఉండగా ప్రస్తుతం కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు సైతం రైల్వేశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కాజీపేట రైల్వే డివిజన్‌కు కావాల్సిన సరిహద్దులు ఏర్పాటు చేయాలని రైల్వే జీఎంకు ఆదేశాలు జారీ చేసింది. కాజీపేట వ్యాగన్, కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు అయితే ప్రత్యక్షంగా.. పరోక్షంగా సుమారు 10 వేల మందికి ఉపాధి లభించనుంది

స్థానికులకు ఉపాధి కల్పించాలి



"పంజాబ్‌లోని కపుర్తాల కోచ్‌ఫ్యాక్టరీలో ఉద్యోగాలు భర్తీ చేసిన విధంగానే కాజీపేట రైల్వే వ్యాగన్‌షెడ్, కోచ్‌ఫ్యాక్టరీలో స్థానిక నిరుద్యోగులకు అవకాశం కల్పించాలి. లేదంటే ఉద్యమిస్తాం. కేంద్ర ప్రభుత్వం రెండు రైల్వే పరిశ్రమలను నెలకొల్పుతున్నందుకు, స్థలం ఇచ్చిన ఆనాటి రాష్ట్ర ప్రభుత్వానికి రైల్వే జేఏసీ తరఫున కృతజ్ఞతలు.

– దేవులపల్లి రాఘవేందర్, రైల్వే జేఏసీ కన్వీనర్

ప్రజా ఉద్యమాలదే విజయం



జిల్లాలో 45 ఏళ్ల ప్రజా ఉద్యమ చరిత్ర గల రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే డివిజన్ మంజూరుకు ఆనాడు చేస్తున్న అనేక ఉద్యమాలకు పీపుల్స్‌వార్ సైతం మద్దతు ప్రకటించారు. రైల్వే జేఏసీ రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ, రైల్వే వ్యాగన్ షెడ్, కాజీపేట డివిజన్ ఏర్పాటు కోసం చేస్తున్న ఉద్యమాలకు మావోస్టు పార్టీ కూడా మద్దతు పలుకుతున్నట్లు ప్రకటించడం జరిగింది. ప్రజా ఉద్యమాలు ఎప్పటికైనా విజయం సాధిస్తాయి.

– కొండ్ర నర్సింగరావు, రైల్వే జేఏసీ చైర్మన్

ఇన్‌స్టాగ్రామ్ పరిచయమే ప్రాణం తీసింది..

- మహిళ వద్ద అప్పు తీసుకున్న యువకుడు
- ఫోన్ సంభాషణలతో అనుమానం పెంచుకున్న మహిళ భర్త
- ప్లాన్ ప్రకారం యువకుడి హత్య
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ, ఎస్సైలు

కాళేశ్వరం: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన మహిళ వడ్డీలకు అప్పులు ఇస్తుందని తెలుసుకున్న ఓ యువకుడు ఆమె సోదరుడి ద్వారా రూ.లక్ష అప్పుగా తీసుకున్నాడు. ఈక్రమంలో మహిళతో తరచూ ఫోన్‌లో మాట్లాడేవాడు. దీంతో ఆమె భర్తకు అనుమానం పెరిగి అపార్థం చేసుకొని యువకుడిని హత్య చేశాడు. జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం చంద్రుపల్లిలో గత బుధవారం జరిగిన ఈ హత్యకు సంబంధించి శుక్రవారం రాత్రి కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం కొమ్మెర గ్రామానికి చెందిన ముత్యాల శ్రీకాంత్ గౌడ్(24) పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం చందనాపూర్ గ్రామానికి చెందిన వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు పొన్నం శివకృష్ణగౌడ్ భార్యతో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం పెంచుకున్నాడు. ఆ మహిళ సోదరుడు పవన్, శ్రీకాంత్‌గౌడ్ ఇద్దరూ స్నేహితులు కావడంతో ఆమె వద్ద రూ.లక్ష అప్పుగా తీసుకున్నాడు. ఆ అప్పు విషయంలో వారిద్దరు తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. గమనించిన ఆమె భర్త పలుమార్లు మహిళను మందలించాడు. ఫోన్‌లో మాట్లాడడంతోపాటు, వారిద్దరు దగ్గరయ్యారనే అనుమానంతో శివకృష్ణ, అతని స్నేహితుడు ఎండీ ఫయాజ్‌తో కలిసి శ్రీకాంత్‌ను చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో కొమ్మెర గ్రామానికి చెందిన కిరాణ దుకాణం నిర్వాహకుడు కురుమ సాయితో పరిచయం పెంచుకుని శ్రీకాంత్ కదలికలను తెలుసుకున్నాడు. ఈ నెల 27వ తేదీన (బుధవారం) గ్రామంలో రెక్కీ నిర్వహించగా అక్కడ లేడని, అన్నారం సమీపంలోని చంద్రుపల్లిలో హార్వెస్టర్ నడిపిస్తున్నట్లు సాయి తెలిపాడు. దీంతో శివకృష్ణ, అతని స్నేహితుడు ఫయాజ్.. సాయి దుకాణంలో బీర్లు, ఆ తర్వాత కల్లు తాగి మహదేవపూర్ మండలం చంద్రుపల్లికి వచ్చారు. అక్కడ హార్వెస్టర్ డ్రైవర్ కోసం తన కారులో వేచి చూస్తున్న శ్రీకాంత్‌తో గొడవపడ్డారు. వెంటతెచ్చుకున్న కత్తితో చాతి, కడుపులో విచక్షణారహితంగా పొడవగా శ్రీకాంత్ అక్కడికక్కడే మృతిచెందడంతో బైక్ వదిలేసి పారిపోయారు. దీంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. హత్యచేసిన రోజు ధరించిన రక్తపుదస్తులు, కత్తి, హెల్మెట్ దాచి ఉంచిన స్థలానికి శుక్రవారం నిందితులు చేరుకోగా చంద్రుపల్లి వద్ద మహదేవపూర్ సీఐ రామచంద్రరావు, ఎస్సైలు చక్రపాణి, పవన్‌కుమార్, తమాషారెడ్డిలతోపాటు పోలీసులు పట్టుకున్నారు. వారినుంచి పల్సర్ బైక్, కత్తి, రక్తపు మరకలతో ఉన్న దుస్తులు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పేదింటికి పెద్ద జబ్బు

- రెండు కిడ్నీలు పోయి.. మంచంపట్టి..
- డయాలసిస్‌తో నెట్టుకొస్తున్న యువకుడు
- కిడ్నీ ఇచ్చేందుకు సమ్మతించిన తండ్రి
- ఆర్థిక స్థోమత లేక ఆపరేషన్‌కు దూరం



దీన గాథ



ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న ఉపేందర్

కురవి: భార్య, ఇద్దరు పిల్లలతో హాయిగా జీవిస్తున్న ఓ పేదింటి యువకుడు రెండు కిడ్నీలు చెడిపోయి మంచం పట్టాడు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నేరడ గ్రామానికి చెందిన ఇటికాల వెంకటయ్య–ఉప్పలమ్మల పెద్ద కుమారుడు ఉపేందర్ మానుకోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కాంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. అదే ఆస్పత్రిలో భార్య పార్వతి ఏఎన్ఎంగా పనిచేస్తోంది. వీరికి అర్పిత 8వ తరగతి, నందిత 3వ తరగతి ఉన్నారు. ఉపేందర్‌కు 8 నెలల క్రితం ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆస్పత్రిలో చెక్ చేయించుకున్నాడు. కిడ్నీలు చెడిపోయాయని వైద్యులు నిర్ధారించారు. దీంతో హైదరాబాద్‌లో మరోమారు పరీక్ష చేయించాడు. అక్కడ కూడా అదే విషయాన్ని చెప్పిన వైద్యులు డయాలసిస్ చేయాల్సి ఉంటుందని సూచించారు. ఈనేపథ్యంలో 8 నెలల నుంచి వారానికి రెండు సార్లు మానుకోటలో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. నిత్యం ఆస్పత్రికి వెళ్లడం.. అనారోగ్యంపాలు కావడంతో భార్యభర్తలు ఆస్పత్రిలో ఉద్యోగం మానేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. ఈక్రమంలో ఆపరేషన్ చేస్తే ఒక్క కిడ్నీతో బతకవచ్చని డాక్టర్లు చెప్పారు. కానీ, కుటుంబాన్ని పోషించడమే భారంగా మారిన ఉపేందర్‌కు ఆపరేషన్ చేయించుకునే స్థోమత లేకపోవడంతో దుఃఖసాగరంలో మునిగిపోయాడు.

ఆపరేషన్‌కు రూ.8 లక్షలు..

రెండు కిడ్నీలు చెడిపోయి మంచంపట్టిన కుమారుడిని పరిస్థితిని చూసిన తండ్రి వెంకటయ్య కిడ్నీ ఇచ్చేందుకు ముందుకొచ్చాడు. కానీ, కిడ్నీ మార్పిడికి రూ.8 లక్షల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పారు. ఆపరేషన్ ఆరోగ్యశ్రీలో చేసే అవకాశం ఉన్నప్పటికీ ఇద్దరిలో ఒకరికే ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని వైద్యులు చెప్పడంతో ఆర్థికస్థోమత లేని ఉపేందర్ ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. దాతలు ఆదుకోవాలని ఉపేందర్‌తోపాటు అతని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

దాతలు **97046 10919** ఫోన్ పే నంబర్‌కు తోచిన సాయం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి మృతి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ కారణాలతో ముగ్గురు మృత్యువాత పడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.



రవి(ఫైల్)

విద్యుదాఘాతంతో వ్యక్తి..

భూపాలపల్లి రూరల్: అడవిపందుల కోసం వేసిన విద్యుత్ తీగలకు తగిలి రైతు మృతి చెందాడు. ఈ ఘటన భూపాలపల్లి జిల్లా నేరేడుపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నేరేడుపల్లి గ్రామ శివారులమేకల రవి(36) అనే రైతు శుక్రవారం మధ్యాహ్నం తన వ్యవసాయ భూమి వద్దకు బయలుదేరాడు. ఆదేగ్రామానికి చెందిన వెంబడి సమ్మయ్య, ఎంబడి శీనులు అడవి పందుల కోసం పెట్టిన కరెంటు వైర్‌లను నిర్లక్ష్యంగా వదిలేశారు. రవి ఆ తీగలకు తగిలి చనిపోయాడు. ఈ మేరకు మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు సీఐ నరేష్ తెలిపారు.మృతుడికి ఇద్దరు పిల్లలు, తల్లి ఉన్నారు.

గడ్డిగూడెం తండాలో..



వీరన్న (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మహబూబాబాద్ మండలంలోని గడ్డిగూడెం తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ మండలంలోని గడ్డిగుడెం తండా గ్రామానికి చెందిన ధరావత్ వీరన్న (45) పొలం పనులకు వెళ్లివచ్చి స్నానం కోసమని నీళ్ల హీటర్తో వేడి చేసుకున్నాడు. ఈక్రమంలో బకెట్ నుంచి హీటర్ తీస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై శరీరంపై తీవ్ర గాయాలై పడిపోయాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు వచ్చి చూసేలోగా వీరన్న మృతిచెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా బ్లూకోల్ట్స్ పీసీలు విజయ్, సంపత్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ వెంకటేశ్, సిబ్బంది సాగర్ ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించారు. మృతుడి భార్య శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై దీపికారెడ్డి తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్లొస్తూ..



రమేశ్(ఫైల్)

టేకుమట్ల: అంత్యక్రియలకు వెళ్లొస్తూ రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని బండపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండల కేంద్రానికి చెందిన తాటికంటి రాజయ్య మృతి చెందగా ఆయన అంత్యక్రియలకు.. మొగుళ్లపల్లి మండలంలోని నర్సింగాపూర్‌కి చెందిన శనిగరపు రమేశ్(45) హాజరై, టేకుమట్ల మండలంలోని కుందనపల్లికి వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో బండపల్లి శివారులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి బురదలో పడిపోయాడు. దీంతో ఊపిరాడక మృతి చెందాడు. కాగా, బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటున్న రమేశ్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వచ్చి తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

- అనాథలైన పిల్లలు
- గూడ్స్ వాహనం డ్రైవర్ అజాగ్రత్తతో ప్రమాదం



సుభాన్(ఫైల్)



సబ్రిన్(ఫైల్)





తల్లిదండ్రుల మృతితో అనాథలుగా మారిన చిన్నారులు నవాజ్, సోని

గీసుకొండ: సాఫీగా సాగుతున్న కుటుంబాన్ని రోడ్డు ప్రమాదం రూపంలో వచ్చిన మృత్యువు చిన్నాభిన్నం చేసింది.. ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందడంతో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కోటగండి సమీపంలో పీడీఆర్ ఫంక్షన్ హాల్ ఎదుట వరంగల్–నర్సంపేట రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి, మృతుల బంధువులు, గీసుకొండ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. వరంగల్ నగరంలోని కరీమాబాద్ ఉర్సు దర్గాకు చెందిన ఎండీ సుభాన్(35), సబ్రిన్ (29) అనే దంపతులకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. భార్యాభర్తలు ఉదయం తమ కొత్త సీఎన్‌జీ ఆటోలో పిల్లలు సుమాయ, సోని, నవాజ్‌లను ఎక్కించుకుని నగరంలోని స్కూల్‌లో వదిలిపెట్టారు. అనంతరం గీసుకొండ మండలంలోని వరంగల్–నర్సంపేట రహదారిలో ధర్మారం తండా సమీపంలో సీఎన్‌జీ బంక్‌లో గ్యాస్ నింపుకుని ఉదయం 11.10 గంటల సమయంలో తిరిగి వరంగల్ నగరానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో పీడీఆర్ గార్డెన్స్ వద్ద వరంగల్ నుంచి నర్సంపేట వైపు వెళ్తున్న సరుకుల రవాణా ట్రక్కు డ్రైవర్ అతి వేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వారి ఆటోను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో సబ్రిన్ అక్కడే మృతి చెందగా, సుభాన్‌ను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. సుభాన్ మామ ఎండీ సోఫీ ఫిర్యాదు మేరకు ట్రక్ డ్రైవర్ గడ్డం జస్వంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రానికి చెందిన బీటెక్ విద్యార్థి చాపర్తి ముక్తానంద్(19) శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గీసుకొండ పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ముక్తానంద్ కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు, రక్త కణాలు తగ్గిపోవడంతో పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా ఫలితం లేకపోవడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి చెంది మధ్యాహ్నం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు చేసుకున్నాడు. మృతుడి తండ్రి చాపర్తి సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

